## క్లుప్తంగా

### కోదండరాంను కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: ప్రొఫెసర్ కోదండరాంను బుధవారం హైదరాబాద్‌లో చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి, జూలూరుపాడుకు చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటప్పయ్య, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు బండ ఆంజనేయులు మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ విషయాన్ని వెంకటప్పయ్య స్థానిక విలేకరులకు తెలిపారు.

### పరిహారం అందేలా చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారని, పంటలను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపి ఆదుకోవాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... పాల్వంచలోని 36 పంచాయతీల్లో 19 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, వరి 6,300 ఎకరాలు సాగు చేశారని, సుమారు రెండు వేల ఎకరాలు కోత కోయడం జరిగిందని, మిగితా పంట దెబ్బతిందన్నారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. ఏఓ శంభో శంకర్, ఏఈఓ టి.ఉదయభాను, సీహెచ్.శాంతి, ఎన్.అనురిక, ఎం.సుజాత, వై.సత్యం, సొసైటీ సీఈఓ జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ మెంబర్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి కూలీలైన్ మసీదు ఏరియాలో నివాసముంటున్న మహ్మద్ అబ్దుల్ సమద్ (వసీమ్)కు ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సహాయం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. సమద్ తోపుడు బండిపై అరటిపండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనుకోకుండా అతని ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని మంచం పట్టాడు. గుండె, కిడ్నీ, లివర్ సమస్యలతో బాధపడుతున్నాడు. భార్య, ముగ్గురు సంతానంతో కుటుంబ పోషణకు, వైద్య చికిత్సలకు ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకొని స్పందించిన ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ జిల్లా కమిటీ వారు సహాయం అందించారు. సమద్‌కు సహాయం అందించే దాతలు 9581954036 నంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరారు. లోగాని శ్రీనివాస్, మహ్మద్ ఖాసి, చిట్టిమల్ల బ్రహ్మంచారి, మెంబర్ అబ్దుల్ నజీర్ అహ్మద్, డింపుల్ శర్మ పాల్గొన్నారు.

# మార్కెట్‌లో మౌలిక వసతులేవి?

- కొత్త సర్కారైనా కరుణించాలి..
- ప్రభుత్వానికి హమాలీల విజ్ఞప్తి



ప్రైవేట్ స్థలంలో కొనసాగుతున్న పత్తి మార్కెట్ యార్డు

జూలూరుపాడు: జూలూరుపాడు పత్తి మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు కల్పించాలని నూతన ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హమాలీలు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు పండించిన పంట మీద ఆధారపడి హమాలీలు బతుకు జీవనం సాగిస్తున్నారు. ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి పత్తి మార్కెట్ యార్డును జూలూరుపాడులో ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపడతున్నారు. ఈ మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో హమాలీలతోపాటు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పత్తిని లారీల్లో హమాలీలు లోడు చేసేందుకు మార్కెట్ యార్డులోనే పత్తి సీజన్‌లో రోజుకు సుమారు 10 గంటల నుంచి 12 గంటలు గడుపుతున్నారు. సేద తీరడానికి షెడ్లు, తాగడానికి నీళ్లు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేక హమాలీలు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఎండకు ఎండుతూ వానలో తడుస్తూ హమాలీలు పని చేయాల్సిన దయనీయ పరిస్థితి నెలకొన్నది. ప్రతీఏటా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సెస్ రూపంలో సుమారు రూ.2.50 కోట్ల ఆదాయం వస్తుంది. పత్తి నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల హమాలీలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతోపాటు, జలుబు, తుమ్ములు, దగ్గు, తలనొప్పి, జలుబు బారిన పడుతున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో సుమారు 1000 మంది హమాలీలు పని చేస్తుండగా, ఇందులో సగం మందికి మాత్రమే వ్యవసాయ మార్కెట్ కమిటీ లైసెన్స్‌లు ఇచ్చింది. ఇక్కడ పని చేసే హమాలీలందరికీ లైసెన్స్‌లు ఇవ్వాలని కోరుతున్నారు.



పత్తి లోడ్ చేస్తున్న హమాలీలు

### కనీస సౌకర్యాలు కల్పించాలి



గత 20 ఏళ్లుగా హమాలీగా పని చేస్తున్నారు. మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. యార్డులో 1000 మందికి పైగా హమాలీలు పని చేస్తుండగా, సగం మందికి లైసెన్స్ కూడా ఇవ్వలేదు. వ్యవసాయ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– పప్పుల వీరస్వామి, హమాలీ మేస్త్రి

### తాగడానికి నీళ్లు లేవు



తాగడానికి నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. వ్యాపారులే తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. నీడ లేకపోవడంతో భోజనం చేసే సమయంలో కూడా ఎండలోనే తినాల్సి వస్తోంది. ఏ కొద్ది పాటి వర్షం వచ్చినా తీవ్ర అవస్థలు పడుతున్నాం. హమాలీలకు ఆరోగ్య పరీక్షలు కూడా చేయడం లేదు.

– మైపు శ్రీనివాసరావు, హమాలీ మేస్త్రి

### శాశ్వత మార్కెట్ నిర్మించాలి



శాశ్వత మార్కెట్ యార్డును నిర్మించి, హమాలీల సమస్యలు పరిష్కరించాలి. ప్రస్తుత మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. షెడ్లు లేకపోవడంతో సేద తీరేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు ఎలాంటి అవకాశం లేదు. వానొస్తే తడిసిపోవాల్సిందే.

– కళ్లోజి రామస్వామి, హమాలీ మేస్త్రి

## గురుకుల కళాశాలలో యూత్ పార్లమెంట్



యూత్ పార్లమెంట్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పాల్వంచ: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో యూత్ పార్లమెంట్ కాంపిటీషన్ నిర్వహించారు. బుధవారం జిల్లాలోని పాల్వంచ, భద్రాచలం, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, మణుగూరు, ఇల్లెందు, ములకలపల్లి పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు హాజరు కాగా, ఒక్కో పాఠశాల, కళాశాల నుంచి 25 మంది చొప్పున విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్పీకర్, అన్ని శాఖల మంత్రులు, దేశ సభ్యులు, న్యాయశాఖ జడ్జీలుగా అన్ని పాత్రలను పోషించి యూత్ పార్లమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలకు జడ్జిలుగా వీఎల్ఎస్ రత్నమాల, డాక్టర్ డి.విజయశాంతి, డాక్టర్ ఎస్.పావని, కె.సిగ్మాతినా వ్యవహరించారు. జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, ఇన్‌చార్జ్ రమణ కుమార్, ఉపాధ్యాయులు కవిత, సుమన్, దేవిశ్రీ, అనిల్, సైదులు, కరుణాకర్, శ్రీనివాస్, సతీశ్, సంజయ్, రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైంది..

పాల్వంచ: అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు చేపట్టే దీక్షలు ఎంతో పవిత్రమైనవని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్వాల మాట్లాడుతూ.. అయ్యప్ప మాలధారులు ఎంతో కఠినమైన నియమాలతో దీక్షలను పూర్తి చేసుకుంటారని తెలిపారు. కేరళకు చేరి ఇరుముడి అప్పజెప్పి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని, వారి కోరికలు ఫలించాలని ఆకాంక్షించారు. దేవాలయ కమిటీ సభ్యులు బందెల శ్రీనివాస్, కనగాల రాంబాబు, మేడిద సంతోష్, వేమారెడ్డి, ఎన్‌పీ చారి, కందుకూరి రాము, పులి సత్యనారాయణ, అంబేద్కర్ పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని పటిష్టం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యాహక్కు చట్టం –2009 పటిష్టంగా అమలు చేయాలని, నిబంధనలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు ఉచితంగా విద్య అందించాలనే లక్ష్యంతో చేసిన విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం ఉచితంగా విద్య అందించాలనే నిబంధనను పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతీ పాఠశాలలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేసి ఉచిత విద్యను అందిస్తున్న విద్యార్థుల పేరు, అడ్మిషన్ నంబరు, కులం, చిరునామా ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం విధించిన సమయపాలనను విద్యాసంస్థలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగుల రవికుమార్, మాలోత్ వీరూ నాయక్, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, వంగా రవిశంకర్, తాటిపాముల హరికృష్ణ పాల్గొన్నారు.

### సైన్స్‌ఫేర్‌లో 'ఏకలవ్య' విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

టేకులపల్లి: కరీంనగర్‌లో జరిగిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో టేకులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ భద్రయ్య వివరాలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఏకలవ్య పాఠశాలలన్నీ పోటీ పడిన సైన్స్‌ఫేర్‌లో టేకులపల్లి ఏకలవ్య విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉపాధ్యాయ బృందం ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

### ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళా ప్రదర్శన



పాటలు పాడుతున్న కళాకారులు

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సుభాష్‌నగర్‌లో కళా ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాలపై ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ పాటలు పాడి సందడి చేశారు. కళాకారులు బొమ్మెర సత్యం, రాయబారపు రవిబాబు, పాగి వెంకన్న, గోవింద గురువయ్య, నకిరేకంటి వెంకటేశ్వర్లు, కొంద్రు హుస్సేన్ పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వినతిపత్రం



తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్డీ నాయకులు

జూలూరుపాడు: మిచాంగ్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ కొత్తగూడెం డివిజన్ నాయకులు ఎస్కె ఉమర్, మండల కార్యదర్శి వల్లోజి రమేష్‌లు మాట్లాడుతూ.. తుపాన్ ప్రభావంతో వరి, పత్తి, మిరప, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతినడంతో రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి కూరాకుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కనకయ్యను కలిసిన ప్రముఖులు

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఇల్లెందు, టేకులపల్లి, గార్ల బయ్యారం, కామేపల్లి మండలాలకు చెందిన పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఇల్లెందులోని ఆయన క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన ముస్లిం మతపెద్దలు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం టేకుపల్లి మండలం సులానగర్ పీహెచ్‌సీ వైద్య బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టేకులపల్లి మండలం అమ్మ ఫౌండేషన్ జిల్లా చైర్మన్ ఆకారపు స్వప్న, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు సాములు నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దంతోజు నవీన్‌కుమార్, సరిలాల్, మోతుకూరి ధర్మారావు తదితరులు ఉన్నారు.

కోరంను కలిసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు..

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాల్టీలో అధికార బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బుధవారం ఇల్లెందు మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా ఆధ్వర్యంలో జేకే ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సయ్యద్ ఆజమ్, తోట లలిత శారద, కడకంచి పద్మ, తార, పాబోలు స్వాతీ, శిలివేరు అనిత, సందా బిందు తదితర 17 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచిన కోరం కనకయ్యను కోయగూడెంలోని ఆయన స్వగృహంలో బుధవారం పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు. బోడు ఎస్ఐ బత్తిని రంజిత్ ఎమ్మెల్యేకు పూలబొకే అందజేసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అమ్మ ఫౌండేషన్ జిల్లా చైర్మన్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఆకారపు స్వప్న, కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ నాయకుడు బానోతు సాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దంతోజు నవీన్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు బుర్ర శంకర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బి.సరిలాల్, సీనియర్ నేత మోతుకూరి ధర్మారావు, టేకులపల్లి మండల సెర్ప్ విభాగం ఆధ్వర్యంలో ఏపీఎం రవికుమార్, సీసీలు నరేష్, సునీల్, నాగేశ్వర్‌రావు, నాగమణి, సావిత్రి, శ్రీలత, సమ్మయ్య, కిరణ్, వీవోఏలు గౌసియా, సౌందర్య, రమణ, పావని, వీణ, సంధ్య, రజిత, రోజా, శిరోమణి తదితరులు ఎమ్మెల్యేని కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఇల్లెందు: ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు



టేకులపల్లి: బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బోడు ఎస్ఐ రంజిత్



శుభాకాంక్షలు తెలుపుతున్న మండల సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది

## రాజకీయాలకు అతీతంగా నడుచుకోవాలి



లారీ ఓనర్ల అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: డ్రైవర్లు, ఓనర్లు కలిసికట్టుగా రాజకీయాలకు అతీతంగా యూనియన్‌ను నడపాలని ఇల్లెందు ఏరియా కోల్ ట్రాన్స్‌పోర్టు లారీ ఓనర్లకు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. బుధవారం ఇల్లెందులో లారీ ఓనర్లు సమావేశమై యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో యూనియన్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో చందాలు, దందాలు లెవ్వు అన్న నాయకుడు.. కేటీసీలో లారీ ఓనర్లను, డ్రైవర్లను ఏ విధంగా హింసించాడో ఎంతమంది ఓనర్లు గుండెపోటుతో మృతి చెందారో ఇల్లెందు లారీ ఓనర్లు మర్చిపోలేదన్నారు. ఇక మీదట అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. లారీ ఓనర్లు, డ్రైవర్లు ఐకమత్యంతో నెలనెలా సమావేశమై చర్చించుకుని ముందుకు సాగాలని తెలిపారు. లారీ ఓనర్లలో పేదలు ఉంటారని, డ్రైవర్లు పని చేస్తేనే తప్ప పూట గడవని వారు ఉంటారని, అలాంటి వారికి ఉపాధి లభించేలా చూడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పింగళి నరేష్, బోళ్ల సూర్యం, మడుగు సాంబమూర్తి, సదానందం తదితరులు పాల్గొన్నారు. అనంతరం లారీ ఓనర్ల అసోసియేషన్ నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఘనంగా సత్కరించారు. అనంతరం గౌరవాధ్యక్షుడిగా వి.చిట్టిబాబు, అధ్యక్షుడు మౌలానా, ఉపాధ్యక్షుడు నల్ల శ్రీను, సెక్రెటరీ జెమినీ వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ ఫక్రుద్దీన్, ఆర్గనైజర్ బి.రాములు, ప్రచార కార్యదర్శి మగ్బుల్, రహీం, కోశాధికారి ఎండీ రషీద్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

## ప్రభుత్వ సంఘానికి అవకాశం ఇవ్వండి

ఇల్లెందు: సింగరేణికి పుట్టినిల్లు అయిన ఇల్లెందులో బొగ్గు పరిశ్రమ నిర్వీర్యమైపోతోందని, ఇక్కడి కార్మికులు మరో ప్రాంతానికి వలస వెళ్లాల్సిన దుస్థితి రాబోతోందని, ఇందుకు నిన్నటి వరకు ఇక్కడ గుర్తింపు సంఘంగా ఉన్న సంఘం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య విమర్శించారు. బుధవారం ఇల్లెందు జేకే ఓసీలో ఐఎన్‌టీయూసీ ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లెందులో కష్టాల్లో ఉన్న కార్మికులను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామన్నారు. గుండాల, కాచనపల్లి లాంటి చోట్ల బొగ్గు బావులు రావటం వల్ల ఇక్కడ కార్మికులకు మనుగడ ఉండేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల సహకారంతో సీఎంను కలిసి ఈ ప్రాంత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. టీబీజీకేఎస్ వల్ల నూతన బావులు రాకపోగా బొగ్గు పరిశ్రమ నిర్వీర్యమైపోయిందని, సింగరేణి సొమ్మును కొల్లగొట్టారని ఆరోపించారు. సింగరేణిలోనూ అధికార పక్షానికి ఒక అవకాశం ఇవ్వటం ద్వారా కార్మికుల హక్కులు, సమస్యలకు పరిష్కారం అభిస్తుందన్నారు. అనంతరం పలు సమస్యలపై ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఐఎన్‌టీయూసీ నేతలు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నేతలు కనకరాజు, శంకర్‌నాయక్, లింగాల జగన్నాథం, మహబూబ్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎస్‌కే జానీ, సుదర్శన్ కోరీ, డానియేల్, పులి సైదులు, తోట వెంకటేశ్వర్లు, చిన్నా, వెంకటనారాయణ, అన్వర్, వేణు, సూర్యం, సాంబమూర్తి, సదానందం, జాఫర్ పాల్గొన్నారు.

## ఉద్యోగాల కల్పనలో టీబీజీకేఎస్‌ది కీలకపాత్ర



కార్మికులను ఓటు అభ్యర్థిస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గడచిన పదేళ్లలో ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 4,207, ఇంటర్నల్ నోటిఫికేషన్ ద్వారా 3,500, డిపెండెంట్ ఉద్యోగాల ద్వారా 18 వేల ఉద్యో గాలు ఏర్పాటులో టీబీజీకేఎస్ కీలకపాత్ర పోషించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. బుధవారం ఏరియా వర్క్‌షాపులో ఆయన కార్మికులను కలిసి ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాట్లాడుతూ.. సింగరేణికి బొగ్గు గని కార్మిక సంఘం శ్రీరామరక్షలా ఉందని, కంపెనీ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, నూతన ఉద్యోగాల విషయంలో బాధ్యత గల యూనియన్‌గా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి ఎండీ సత్తార్ పాషా, కే.నాగమోహన్, యాకూబుద్దీన్, సముద్రాల శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, పీఆర్‌సీ రెడ్డి, రాజు, దుర్గప్రసాద్, కేవీ రెడ్డి, జయరాజు, బాబుద్దీన్, బి.గోపాల్, టి.రమేష్, శ్రీనువాసు, శ్రీహరి పాల్గొన్నారు.

## అధికార పార్టీ సంఘాలతో ఒరిగేదేమీ లేదు..



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ఇల్లెందు: సింగరేణిలో నిన్నటి అధికార పక్షం టీబీజీకేఎస్‌తో పాటు రాబోయే కాలంలో అధికార పక్షంగా చెలామణి కాబోవు మరో యూనియన్‌తో కార్మికులకు ఒరిగేదేమీ లేదని, కార్మికుల పక్షాన పోరాడేది మాత్రం ఏఐటీయూసీనేనని, ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఇల్లెందులోని జీఎం కార్యాలయం వద్ద ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో టీబీజీకేఎస్ సర్కార్ సంఘంగా గెలిచి కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. జాతీయ కార్మిక సంఘాలను దూషించే టీబీజీకేఎస్ సాధించింది ఏమీ లేదన్నారు. నష్టాల్లో కూరుకుపోయిన సింగరేణి సంస్థను ఐదు జాతీయ కార్మిక సంఘాలు చర్చలకు పిలిచిన సందర్భంగా లాభాల దిశగా పెంపొందించాలని మారిటోరియం ఇప్పించటం జరిగిందన్నారు. సర్కార్ సంఘం విధానాల వల్ల సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని, ఫలితంగా సింగరేణి భవిష్యత్ అంధకారంగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, దాసరి రాజారామ్, ముస్తాఫా, గుగులోతు కృష్ణ, లచ్చిరామ్, మంచాల వెంకటేశ్వర్లు, అజ్మీరా కిషోర్, బాలాజీ, వీరన్న, బంధం నాగయ్య, ప్రవీణ్, షబ్బీర్, మైఖేల్, వలీ, వేణు, మంగ, భార్గవి, తేజావతి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని డిజిగ్నేషన్లను మారుస్తాం..



మాట్లాడుతున్న మాధవ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): బదిలీ వర్కర్స్ డిజిగ్నేషన్‌ను రద్దు చేయడంతో పాటు, అన్ని డిజిగ్నేషన్లకు కేడర్ స్కీమ్ అమలు చేయించడానికి కృషి చేస్తామని ఏబీకేఎంఎస్ (బీఎంఎస్) జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ అన్నారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 షాఫ్ట్ గని ఆవరణలో ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్ ఇండియాలో బదిలీ వర్కర్ డిజిగ్నేషన్ రద్దు చేసి రెండు దశాబ్దాలు గడుస్తున్నా సింగరేణిలో బదిలీ వర్కర్ డిసిగ్నేషన్‌ను కొనసాగించటం శోచనీయమన్నారు. బీఎంఎస్ గుర్తింపు సంఘం అయిన వెంటనే ఈ డిజిగ్నేషన్‌ను రద్దు చేయించి, జనరల్ మజ్దూర్లుగా నియామకం చేస్తామన్నారు. సింగరేణిలో అన్ని డిజిగ్నేషన్లను అనగా జూనియర్ అసిస్టెంట్ నుంచి పీఏ వరకు అన్ని డిప్లొమా ఉద్యోగస్తులకు, ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి, మెడికల్, పారా మెడికల్ వర్క్‌షాపులో పనిచేస్తున్న ట్రేడ్స్‌మెన్లకు ప్రమోషన్స్ విషయంలో ఇతర పబ్లిక్ సెక్టార్స్‌లో మెరుగైన క్యాడర్ స్కీమ్ అంశాన్ని సమీక్షించి అమలు చేస్తామన్నారు. అంతేకాకుండా అన్ని డిజిగ్నేషన్లను గౌరవప్రదమైన మార్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లట్టి జగన్మోహన్, టి.నరేంద్రబాబు, జీవీ కృష్ణారెడ్డి, పవన్‌కుమార్, గంధం సతీష్, నాగేశ్వరరావు, ఉదయ్‌కుమార్, బీమా, వీఎన్ మూర్తి, రాజమౌళి, అల్లి ప్రకాశ్, నరేష్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం డీఈఓ ఎం.వెంకటేశ్వరచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ... కార్మికులకు గత సంవత్సరం జూన్ నుంచి పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలు అమలు చేయడం లేదని తెలిపారు. దీనికి తోడు గుడ్లు కూడా భోజనంతో వడ్డించాలని హెచ్‌ఎంలు, కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ప్రభుత్వ పాఠశాలలోని బియ్యం పురుగులు పట్టి పాడైపోయి ఉన్నాయని, ఆ బియ్యాన్ని చెరిగి వండిపెట్టమని హెచ్‌ఎంలు చెబుతున్నారని తెలిపారు. నాణ్యమైన బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.